క్లుప్తంగా

ఆకుతోటల రైతులను ఆదుకోవాలి



క్రిష్టిపాడులో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెద్దవడుగూరు: జిల్లాలోని ఆకుతోటల రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల సీపీఎం నాయకులు దస్తగిరి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడు సమీపంలోని ఆకు తోటలను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆకు తోటలు సాగు చేసిన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. గిట్టుబాటు ధర లేక పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆకుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. రైతులను ఆదుకోలేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు క్రిష్ణమూర్తి, మద్దిలేటి, పెద్దయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

- ఇద్దరికి గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు గ్రామ సమీపంలో ఉన్న బ్లూమూన్ రెస్టారెంట్ వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన చోటు చేసుకొంది. ఘటనలో పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన మల్లీశ్వరరెడ్డి, గుండాలతండాకు చెందిన వెంకటేష్‌నాయక్ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

శింగనమల క్రాస్‌లో అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శింగనమల: శింగనమల మరువకొమ్మ క్రాస్‌లో శనివారం రుశ్యశృంగ మహాముని, శ్రీరంగరాయుల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శింగనమల మరువకొమ్మ క్రాస్‌లో రుష్యశృంగ మహాముని, శ్రీరంగరాయులు విగ్రహాల ఏర్పాటు నేపథ్యంలో భక్తులకు మసూల బాలన్న కుటుంబీకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాంచరణ్, పెద్దన్న, భక్తులు పాల్గొన్నారు.

నేడు కోటి సంతకాల సేకరణ ఉద్యమం

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ సూచన మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం సాయంత్రం మండలంలోని దయ్యాలకుంటపల్లి, వెంకటాపురంలో కోటి సంతకాల సేకరణ, గ్రామ కమిటీల ఏర్పాటు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి



తొట్టిలో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

యాడికి: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని 3వ సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వేపై తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డ్రమ్ములు, తొట్టిల్లో నీటిని నిల్వ ఉంచుకుంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు రాత్రి పూట దోమతెరలను వాడాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో యాడికి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి మొక్కల ధ్వంసం

బుక్కరాయసముద్రం: గార్లదిన్నె మండలంలోని కోటంక గ్రామంలో ఓ రైతు పొలంలో రెండు గంజాయి మొక్కలు ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సునీత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఎవరైనా సరఫరా చేస్తున్నట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. కోటంకలో ఓ రైతు పశువుల కోసం రెండు మొక్కలు పెంచారన్నారు. ఆ మొక్కలు ధ్వంసం చేశామన్నారు. ఎవరైనా గంజాయి మొక్కలు పెంచినా సరఫరా చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం

- కుక్కల దాడులతో హడలెత్తిపోతున్న గుంతకల్లువాసులు
- రెండు రోజుల్లో 13 మందికి కుక్కకాటు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కుక్కల దాడిలో గాయపడిన వర్ష, నాగరాజు



గుంతకల్లులోని స్టేషన్ రోడ్డులో గుంపుగా కుక్కలు

గుంతకల్లుటౌన్: గత కొన్ని నెలలుగా గుంతకల్లు పట్టణంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామసింహాల దాడులతో పురప్రజలు హడలెత్తిపోతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతున్న శునకాలను చూసి రోడ్లపై తిరగాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాల వెంబడి శునకాలు పరిగెత్తడం వల్ల అనేక మంది కిందపడి గాయాలపాలవుతున్నారు. శుక్రవారం రాత్రి బీటీ పక్కీరప్ప కాలనీలో ఐదుగురిపై వీధి కుక్క దాడిచేసింది. దుకాణానికి వెళ్తున్న ఏడేళ్ల బాలిక వర్ష చేతిపై విచక్షణా రహితంగా దాడి చేసింది. పాపను కాపాడేందుకు వెళ్లిన బాలిక తండ్రి బేల్దారి నాగరాజు పెదవిపై కుక్క కరిచింది. దీంతో వారిద్దరూ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అదే వీధికి చెందిన చిట్టెమ్మ, గీత, వేణమ్మను కూడా అదే వీధికుక్క కరవడంతో వారు కూడా ఆస్పత్రికి వెళ్లి ఏఆర్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి రికార్డుల ప్రకారం రెండు రోజుల్లో పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన ఖాసీంవలి(పాత గుంతకల్లు), శంకర్ (కసాపురం రోడ్), నయనిక (మోమినాబాద్), జనార్దన్‌నాయుడు (60 అడుగుల రోడ్), ఇందిర, సుబాన్, సతీష్, బన్నీ వీధికుక్కల దాడిలో గాయపడి ఏఆర్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. గత నెల 17న ఈద్గా మసీదు ఏరియాకు చెందిన వీధికుక్క ట్యూషన్‌కు వెళ్తున్న చిన్నారులు భువనతేజ, కేతన, మెహనాజ్‌లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కుక్కల దాడి నుంచి రక్షించాలని ఆ కాలనీ మహిళలు పెద్ద ఎత్తున మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా చేసినా అధికారుల్లో చలనం లేకుండా పోయింది.

మొద్దునిద్ర వీడని మున్సిపల్ అధికారులు

పట్టణంలో పిల్లలపై వీధికుక్కలు రెచ్చిపోతూ దాడికి తెగబడుతున్నా మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. రోజూ పట్టణంలో ఏదో ఒక చోట వీధి కుక్కలు రెచ్చిపోతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కుక్కలను పట్టించి కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయిస్తామని అధికారులు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ప్రతి నెలా కౌన్సిల్‌లో సభ్యులు కుక్కల దాడి నుంచి ప్రజల్ని కాపాడాలని గగ్గోలు పెడుతున్నా కమిషనర్, సంబంధిత అధికారులు పెడచెవిన పెడుతున్నారు.

సంతాన నిరోధక శస్త్రచికిత్సలెప్పుడో..

మున్సిపల్ ప్రజారోగ్య విభాగాపు అధికారుల లెక్కల ప్రకారం గుంతకల్లు పట్టణంలో సుమారు 2,700 వీధి కుక్కలున్నాయి. వీటిలో 1,600 కుక్కలను పట్టించి రెండేళ్ల క్రితం వాటికి కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలు జరిపించారు. రేబిస్ టీకాలు వేయించి తిరిగి వాటిని పట్టిన ప్రదేశంలోనే వదిలేశారు. కుక్క కాటు కేసులు రోజూ పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి జంతు సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయొద్దు



పట్టణంలోని ఆస్పత్రిలో కుక్క కాటు కేసులు అధికమయ్యాయి. కుక్క కరిచిన ప్రదేశంలో వెంటనే సబ్బు నీళ్లతో కడిగి తీవ్ర రక్తస్రావం కాకుండా శుభ్రమైన కాటన్ గుడ్డతో కట్టుకట్టుకుని ఆస్పత్రికి వచ్చి టీటీ ఇంజెక్షన్, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కుక్కకాటు బాధితులు నిర్లక్ష్యం వహించరాదు. తప్పనిసరిగా వైద్యం చేయించుకోవాలి.

– జయవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



గేట్స్ కళాశాలలో ప్రసంగిస్తున్న రవీంద్ర

గుత్తి: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు, ఆలోచన శక్తిని పెంపొందించుకోవాలని వందేమాతరం వ్యవస్థాపకుడు రవీంద్ర సూచించారు. గుత్తిలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం విద్యార్థీ ఆలోచించు అనే ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల ఆలోచనలు, జీవిత చైతన్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు విజయం దిశగా ఆలోచించే దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, సామాజిక గాయకుడు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహిళల నృత్య ప్రదర్శన



సీఎస్‌ఐ చర్చిలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో శనివారం స్త్రీల మైత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టరమ్మ సువర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఆరాధనలో చర్చి మహిళలు ప్రదర్శించిన కోలాటం, స్కిప్ట్, సంకీర్తన ఆలాపనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేవుడి సేవలో స్త్రీల పాత్ర పాముఖ్యతపై వక్తలు వివరించారు. ఈసందర్భంగా మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సామూహిక భోజనాలు ఆరగించి ఆనందోత్సాహాల నడుమ స్త్రీల మైత్రి నిర్వహించారు. ముందుగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రార్థనతో స్త్రీల మైత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, రత్నరాజు, బుజ్జిబాబు, రాజు, రమణ, ప్రసాద్, రజని, మంజులమ్మ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, రేచెల్, మెర్సీ, మహిమ, సుశీలమ్మ, సారామాధురి, లత, అంజలి, సంగమేశ్వరి, వాణి, ప్రశాంతి, వందన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల చోరీలు అరికట్టండి



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురంలో ఉన్న పంట పొలాల్లో తరచూ విద్యుత్ తీగలు చోరీకి గురవుతున్నాయని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం సీఐ రామారావుకు గ్రామానికి చెందిన రైతులు వినతి పత్రం అందజేశారు. రైతులు శ్రీనివాస్‌చౌదరి, నాగేంద్ర, రాజేంద్రప్రసాద్, రాజశేఖర్ మాట్లాడుతూ శుక్రవారం రాత్రి గ్రామంలో పది మంది రైతుల వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయన్నారు. విద్యుత్ తీగలను చోరీ చేయడంతో పంటలకు నీరు పెట్టలేకపోతున్నామని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. గ్రామ శివారులోని పొలాల్లో రోజూ చోరీలు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. పది మంది రైతులకు చెందిన విద్యుత్ తీగలు, పరికరాలు చోరీ చేయడంతో రూ.1.20 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. చోరీలను కట్టడి చేయాలని, దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు సీఐని కోరారు.

రక్తదానం మరొకరికి పునర్జన్మనిస్తుంది



రక్తదానం చేస్తున్న సిబ్బంది

బుక్కరాయసముద్రం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే.. వారికి పునర్జన్మను ఇస్తుందని మానవత రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మానవత రక్తదాతల సంస్థ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సంయుక్తంగా బ్లడ్ గ్రూపింగ్, రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతన్నారు. అనంతరం కళాశాలలో 850 మంది విద్యార్థులు రక్త నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 140 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ సిబ్బందికి అందజేశారు.. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చిన్న పుల్లయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగులో మేలైన సూచనలు, సలహాలు అందిస్తే అధిక దిగుబడులు సాధిస్తారని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ధన ధ్యాన కృషి యోజన ప్రోగ్రాం ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ రూ.42 కోట్లతో వ్యవసాయ ప్రాజెక్టులను ప్రారంభించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రేకులకుంట పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ విజయశంకర్‌బాబు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర పశు పరిశోధణా కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రారెడ్డి, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మధవి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, సస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి, వెటర్నీ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన, కేవీకే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలపై కోటి సంతకాల ఉద్యమం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, ఇతర నాయకులు

గుంతకల్లుటౌన్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదోడికి వైద్యసేవలను దూరం చేసేందుకు కూటమి సర్కారు పన్నుతోన్న కుట్రలపై సమరానికి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్లను శనివారం ఆమె పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. నైరుతిరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యరంగాలను కూటమి సర్కారు నాశనం చేసి పేదప్రజలను ఇబ్బందులు పెడుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. అయితే పీపీపీ విధానం ద్వారా తమ వారికి అడ్డగోలుగా వైద్య కళాశాలలను ధారాదత్తం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె నిప్పులు చెరిగారు. కూటమి కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఖలీల్, కౌన్సిలర్లు కుమారి, లింగన్న, సుమో బాషా, సర్పంచ్ నారాయణస్వామి, అనుబంధ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు బాబూరావు, బాసిద్, అంజి, షాబుద్దీన్, వంశీయాదవ్, సూర్యరెడ్డి, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఎం.ఎం. రెహమాన్, మాజీ కౌన్సిలర్లు పాండు, సుంకప్ప, నాయకులు నూర్‌నిజామి, బావన్న, ఆర్డీజీ బాషా, నాగేంద్ర, దర్గానాయుడు, పరుశురాముడు, సంపత్, వీరన్న, వెంకటేష్, జగన్, దాసరిహరి, కరీమ్, నాగప్ప, హనుమంతు, శాంతనాయుడు, పక్కీరప్ప,సుధాకర్,మేరీ, సునీతబాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బరాయుడు

గుంతకల్లు రూరల్: స్థానిక కేజీబీవీ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాలికల హక్కులు, సమాజంలో వారు ఎదుర్కొనే సవాళ్లపై ఎంఈఓలు మస్తాన్ రావు, సుబ్బరాయుడు పలు సూచనలు చేశారు. బాలురతో సమానంగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

ప్రారంభానికి నోచుకోని 'జన ఔషధి'



గుంతకల్లు జంక్షన్‌లో తెరచుకోని ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రం

గుంతకల్లు: రైలు ప్రయాణికుల సౌకర్యార్థం గుంతకల్లు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. రైల్వేస్టేషన్ భవనం ఎంట్రెన్స్‌లోనే ఎడుమ వైపున లక్షాలాది రూపాయలు ఖర్చు చేసి అరు నెలల కిత్రం జన ఔషధ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రసుత్తం జన ఔషధ కేంద్రానికి అతికించిన పబ్లిసిటి పోస్టర్లు సైతం ఊడిపోతూ పాడవుతున్న అధిఆరులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే యాజమాన్యం జన ఔషధి కేంద్రాన్ని గుంతకల్లు జంక్షన్‌లో ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మందులను సైతం తక్కువ ధరలకే అందజేస్తారు. ఉపయోగకరంగా ఉండే ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో కూటమి నేతల నకిలీ మద్యం తయారీ కుంభకోణం వెలుగు చూసిన నేపథ్యంలో పట్టణంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేపట్టారు. శనివారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ సీఐ శివసాగర్, జిల్లా కేంద్రం నుంచి వచ్చిన పలువురు అధికారులతో కలిసి పట్టణంలోని హనుమాన్ సర్కిల్, రైల్వేస్టేషన్ రోడ్, ఆర్‌అండ్‌బీ సర్కిళ్లల్లో ఉన్న మూడు వైన్‌షాపుల్లో నకిలీ మద్యం, అధిక ధరల విక్రయాల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. అయితే తనిఖీలకు సంబంధించిన విషయాలను మీడియాకు వెల్లడించేందుకు ఎక్సైజ్ అధికారులు నిరాకరించారు. షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయాలు, వైన్‌షాపుల వద్ద అనధికార పర్మిట్‌రూమ్, బహిరంగ మద్యపానం సేవించే విషయాలు తెలిసినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం జేవీవీ చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను జేవీవీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి మాట్లాడారు. ఈ నెల 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న మండల స్థాయిలో, నవంబర్ 23న జిల్లా స్థాయిలో, డిశంబర్ 12న రాష్ట్ర స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శ్రీధర్ గౌడ్, దేశాయి నాగరాజు, రవి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

యల్లనూరు: లింగాల మండలం అంకేవానిపల్లికి చెందిన మన్నెల సురేష్‌పై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు శనివారం తెలిపారు. వివరాలు.. యల్లనూరుకు చెందిన పెద్దన్నకు అతడికి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. సురేష్ చిలమకూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా యల్లనూరుకు చెందిన పెద్దన్న, పెద్దిరాజు, నరేష్ వెంకటరమణ తదితరులు.. సురేష్‌ను కొట్టి గాయపరిచారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపిపారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు

గుత్తి: ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఓల్డ్ సీపీఐ కాలనీలో దస్తగిరి జెండా కట్ట స్థల వివాదంపై గురువారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శుక్రవారం ఒక వర్గానికి చెందిన 24 మందిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మరో వర్గానికి చెందిన సునీత అనే మహిళ కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో శనివారం భాగ్యమ్మ, అనిల్, పద్మపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశారు.



క్యూలో ఇబ్బంది పడుతున్న బ్యాంకు ఖాతాదారులు

ఒకే కౌంటర్‌తో కస్టమర్లకు ఇక్కట్లు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న కెనరా బ్యాంకులో డబ్బు డ్రా చేసుకోవడానికి, డిపాజిట్ చేయడానికి ఒకే కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కస్టమర్లు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వృద్ధులు, రోగగ్రస్తులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకే కౌంటర్ ఉండడంతో కస్టమర్లు గంటల తరబడి క్యూ లైన్లో వేచి ఉండలేక అవస్థలు పడుతున్నారు. గత శుక్రవారం కొందరు నిలబడలేక వెనుదిరిగారు. ఈ సందర్భంగా పలువురు కస్టమర్లు మాట్లాడుతూ ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడం వల్ల చాలా అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. రెండు రోజులుగా తిరుగుతున్నా పనులు కావడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. కౌంటర్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోసం ప్రయతించగా అందుబాటులోకి రాలేదు. ఒకే కౌంటర్ ఉండటంతో తాము కూడా ఇబ్బందులు పడుతున్నామని బ్యాంకు ఉద్యోగులు వాపోయారు.